# పెట్టుబళ్లేని యాపారం

''నా యిష్టం కిష్నాపురం. నారాజా రామాపురం. ఒకరు నన్ను అడగాల్సిన పన్లే. నేను బొదులు చెప్పాల్సిన పన్లే. అదంతే! – అనే అగుటీటం మణుసుల్తో ఆఁ! అన్నా తప్పే! ఊఁ! అన్నా తప్పే!''

మా బాశాలి నడవలో నాజూగ్గా కూసుణ్ణింది. పొనగెంటాకు కూరాకు ఏరిపించుకుంటా పల్లవి అందుకునింది. ఇంక పాట ఎట్ట పొయ్ ఎట్టొస్తిదో యిందామనుకోని ఒక చెవ్వు అట్టా పెట్టేసి పట్టించుకోనోడి మాదిర్తో పరాగ్గా నిలబడుకుణ్ణా!

మా బాశాలి కాడల్ను కాసుకు తగనట్టు యిసిరి సిరి పారేస్తా ఆకుల్ను పువ్వుల్ను మాత్రం ఏరిపించి జాగర్తగా ఒక శాట్లో బద్రపర్సుకుంటా ఉండాది. పాపం! ఆ కాడలే గదా యియ్యరవ దాకా ఆకుల్ను పువ్వుల్ను బరాయించింది.

బరాయించే వాళ్లు ఎప్పుడూ తిని కూసుండే వాళ్లకు అదవే గదా?... మోసే వాళ్లెప్పుడూ ఎక్కి కూసుండే వాళ్లకు అదవయినట్టు!

ఆకుప్పలో పొనగంటి పూలు నన్ను ఓర గంట చూస్తా నవ్వుకుంటా ఉండాయి.

''మణిసిని ఒక్కసారి ఎగాదిగా చూస్తే చాల్దా? కూడు ఉడికిందో లేదో అని మెతుకు మెతుకు పట్టి పట్టి చూడాల్నా? వాడు ఎటుమంటి యదవైనా సరే! ఎనుకూ ముందూ చూసే పనేలే. ఎత్తి నెత్తిన పెట్టుకుండేది. 'నా యిచ్చు చూడు!... నా యిలంబరం చూడు!' అంటా ఊరేగేది. మల్లా ఆయదవ యిట్టాటోడని తెల్సేకుందికి వగస్తా నెత్తిన చేతులు పెట్టుకోని కూసుండేది. తొందర పణ్ణె గొడ్డు తాగేదెప్పుడూ మురికి నీళ్లే గదా?''

చూడబోతే మా బాశాలి చేతి యిసురుకంటే నోటి దురుసే జాస్తిగా ఉండాది. కత అట్ట బొయ్ యిట్ట బొయ్ కడాన చూడబోతే మనకాడికే వచ్చేటట్టుగా ఉండాది. ఎందుకన్నా మంచిదని చూపుల కత యిడ్సి పెట్టేసి మణుసుకు మాత్రం పగ్గాలేసి బిగపట్నా.

''వాడు... వాడి చూపులు... వాడి మాట తీరు... నడతా నాణెం... అరి చేతికి అద్దం ఎందుకన్నెట్టుగా తెల్సి పోతానే ఉండాది. ఎటుమంటి పనికి మాలినోడైనా అటుమంటి యదవను దగ్గిర చేరస్తారా? వాడి మాట్లకు బేలి పోతారా? అష్టాబాపత్తుగా నూరు రూపాయిలెత్తి వాడి చేతికిచ్చేస్తారా?''

''మొగలాయి యాడ మునిగి యాడ తేలిందబ్బా?'' అనుకుంటి.

వగస్తానే వాడి ఆలితాడు తెంచినట్లు ఒంటికి సెగ దగలకుండా నైస్‌గా నన్ను కుడితొట్లో ముంచేసి ఆపె శాట శాతపట్టుకోని వంటింట్లో తేలె. నేనా కుడితొట్లో బల్లి మాదిర ఊపిరిడకుండా కొట్టుకుండా ఉండా!

ఆ మద్దె ఒకనాడు నన్ను ఎతుక్కుంటా మా యింటికి వొకడొచ్చె. వచ్చినోడు వచ్చినట్టే రొండు చేతులెత్తి దణ్ణం కూడా పెట్టె!

ఈ డెవుడన్నెట్లుగా నా మూతి ముప్పై సొట్లు తిరిగె!

వచ్చినోడు ఊళ్లు తిరిగి కోళ్ల గెల్సిన కోడి గదా? జంకు గింకు ఏమీ లేకుండా ''తొండాడలో మొగిలోళ్ల సుందర్రామి రెడ్డికి తమరు బాగా తెల్సునంట గదా? ఆయన చెప్తేనే తమరి కాడి కొస్తిని.'' అనె.

నమ్మాల్సిన మాటే గదా? నమ్మితి.

వ్యాదొచ్చినోడు ఎర్రోడన్నెట్లు ఆడ పిలకాయిలు ఉండేవాడంటే అందురుకీ అదవే. రూపాయి నెత్తిన పెడితే దమ్మిడే దమ్మిడీ యిలవ చెయ్యని యదవలుగూడా పిల్సి పిల్లనిస్తానంటే 'కులమేమి? గోత్రమేమి?' అని అడగతారు.

అటుమంటప్పుడు వాడికి వాడుగా ఎతుక్కోనొచ్చి–

''పదిపన్నెండు ఎకరాల బూ వసతి ఉండాది. పంపు సెట్టుండాది. టొంటీపోర్ అవర్సు తోలినా అట్టా యిట్టా కసకని కీనీరు బాయి ఉండాది. అబ్బా అమ్మకు ఒక్కడే కొడుకు. ఇంక పెట్టేది పోసేది అంటారా? దాంతో పనేలే. సాంప్రదాయికమైన కుటుంబ్రవయితే చాలు.''

అది ఆడికయ్యిందా? –

కాళాస్త్రికాపక్క వరదయ్య పాళెం. పాళే గాడెందుకు ఆయిన ముందర? ఇద్దురు కూతుళ్లు. ఒకడే కొడుకు. పిలగాడే కడగోటోడు. ఇద్దరు ఆడపిలకాయిలకు పెండ్లయిపోయింది. వాళ్లకు పిలకాయిలు గూడా. బిడ్డ నచ్చిందంటే ఇచ్చేది తీసుకుండే ది ఒక లెక్క లే.''

''ఇంగొగిటి చెప్ప మంటారా?'' అని దండకం చెప్పినట్లు చెప్పక పోతా వుంటే ఏమనుకోవాల?

సరే ననుకోని అందురు ఆడ పిలకాయిల అయ్య మాదిర్నే నేను గూడా ఏదో వొగిటి చేసి పున్నెం కట్టుకోబ్బా! 'అంటే' ఎంత మాట ఎంత మాట అంటా చేతులు పిసుక్కుంటా నిలబడె.

ఇంకేం? అన్నెట్లుగా చూస్తే 'చార్జీల కంటా!' నసిగె. నూరు రూపాయిలెత్తి చేతికిస్తే వొచ్చినప్పుడు రొండు చేతులెత్తి మొక్కినోడు వొంగి వొంగి దండాలు పెట్టా ఎలబారి పాయ!

'ఈ పొద్దు వస్తాడు. రేపు వస్తాడు!' అని ఎదురు చూస్తానే ఉండాం.

వాడు వస్తానే ఉండాడు!

''అయ్యో! అయ్యో! వొగిటా రొండా! అష్టా బాపత్తుగా నూరు రూపాయిలే. ఏట్లో ఏసి నోరుకొట్టుకున్ణె కతాయెనే.'' ఈలు పడ్నెప్పుడంతా కీలెరిగి వాత పెట్నెట్లు మా బాశాలి గోకతానే ఉండాది. మొగ పుట్టక పుట్టి ఎంత సేపని గమ్మనుండేది?

''సడేలే! తిత్తిలో రూక తిత్తిలోనే ఉండాల. బిడ్డకు కిసురొదిలి పోవాలంటే కుదిర్తిందా?''

''నిజిమే! నిజిమే! తిత్తిలో రూక అయిపాయ. నీకు కిసురొదిలి పాయ. ఇంక కొంపలో పనేముండాది? పో! పో! ముద్దరేసి యిడ్సి పెట్టేసి ఉండ్లా. యాడ యామార్తే ఆడొక బొక్కడు మేసేసి పోతా ఉండే పనే గదా?''

నాలిక్కి ఉచ్చేసే వాళ్ల నట్టింట గూడా నిలవలేమంటారు. అదే మెడకేస్తే ఒక పారిగా పోతింది. నాలిక్కేస్తే చస్తా బతికినట్టే లెక్క. 'ఈ చావు ఇంకెన్నాళ్లు ఛావాల్రా నా సామీ' అను కుంటా ఎలబార్తి.

దోవన నడస్తా ఉండా. మణుసు వాడి మిందికే పోతా ఉండాది! నాయాలు ఎంత నంగి నంగి గా వచ్చె ఎంత బాగా నమ్మించె. ఎంత లేసుగా నూర్రూపాయిలు కొట్టేసె. అవును గదా మల్లా? ఆ మాత్రం నేర్సకుండా బోతే వాడు బ్రోకరోడు ఎట్టవతాడు?

నా చిన్నప్పుడు మా అయ్య నన్ను పిల్సి ఒక కాలణా చేతికిచ్చి-

''ఓ రబ్బారే! గుంట కట్టమిందికి పరిగిత్తా పాయ్ అంగిట్లో మీ అత్త ఉంటింది. దమ్మిడి ఆకులు. దమ్మిడి వక్కలు. దమ్మిడి పొవ్వాకు తీసుకోని రా పోరా!'' అనేటోడు.

''అయ్యో! అయ్యో! అట్నే పాయ్ తెస్తానయ్యా. ఈడ ఉణ్ణెట్టే పాయ్ తెచ్చేస్తానయ్యా. ఇంకొక దమ్మిడీ కూడా ఈ అయ్యా!'' అంటే-

''ఒరే నీ యమ్మా నా కొడకా! అప్పుడే నీకెట్టా పుట్టింది రా ఈ దళారోడి బుద్ధి?'' అంటా పక పకా నవ్వేటోడు.

'' అయితే మా పుల్లయ్య చినయ్య చేసేది ఏం పని?''

'' ఆ యదవ చేసేది కూడా అదే పని!''

'' అది కాదయ్యా! ఈ పాయికట్లో ప్రతోడు కాడి కిందికి గొడ్డు కావాలను కుణ్ణా పాలచుక్క కొక పసరం కావాలనుకుణ్ణా మా చినయ్య దగ్గిరికొస్తారు గదా? ఆయన చూపించిన గొడ్డుకే సంచకారం కడ్తారు గదా? ఆయన చెప్పిన కాణ్ణే గొడ్డును పట్టుకోనొచ్చి ఇంట గాట గట్తారు గదా? ఆయన మాట కాదని అమ్మే వాడు అమ్మడు కొనే వాడు కొనడుగదా? మరి ఆయన యదవెట్టవతాడు?''

''ఒరే చిలిపినాకొడకా! వాడు గొడ్డు వాటంవైనం తెల్సుకుణ్ణోడు. ఏగాటికి ఏ సుడి

ఉండే గొడ్డైతే అచ్చివస్తిందో అర్థం చేసుకుణ్ణోడు. తెల్సుకుణ్ణాడు గాబట్టి యిది మంచి యిది సెబ్బర అని చెప్తాడు. అట్టని యీపక్కా ఆపక్కా రొండు పక్కలా చెయ్‌చాపితే ఎట్టా? వొంటికి సెగతగలకుండా బతికే బతుకు అదీ వొక బతుకేనా? ఆ యదవను తెచ్చి అడ్డం పెట్టుకుంటా ఉణ్ణావుగదరా? నువ్వొక యదవన్నరయదవ!''

''నేను యదవ యట్టవతాన్లే? గుంటకట్టమిందికి పరిగిత్తా పాయ్ పరిగిత్తా వస్తే వొంటికి సెగ తగల్తా ఉండ్లా? సెగతగలకుండా బతికేది బతుక్కాదు. నాబతుక్కేమి? నా దమ్మిడి నాకిచ్చెయ్!'' అంటే-

''గుంట కట్ట మిందికి ఒక్కడుగేస్తే పాయ్‌రావచ్చు గదరా. ఆడికి పొయ్యొచ్చే కుందికి వొంటికి తగిలేసెగ అరెరె! అదీ ఒక సెగేనా? మా అయ్య పెనుమూరికి నాలుగుమైళ్లు మెడ యిరిగి పొయ్యేటట్టుగా తమలపాకులు మోస్తే దమ్మిడీలా? నువ్వు దీనికే సుంకం కొట్టేయాలంటే అదేం కుదరదుగానీ నువ్వు పాయ్‌రాబోరే!'' అంటా పంచె కొంగు బిర్రుగా ముడేసేటోడు.

నేనేం తక్కువ తిన్నానా? నేను గూడా పుల్లయ్య అన్న కొడుకునే గదా? చెయ్యాల్సింది చేస్తే సరిపోతిందని నేరుగా గుంట కట్టమిందికి పాయ్-

''అత్తాత్తా! మా అయ్య దమ్మిడికి వక్కలు దమ్మిడికి పొవ్వాకు తీసుకోని రమ్మన్నాడు'' అంటా కాలణా చేతికిస్తే- దమ్మిడికి వక్కలు దమ్మిడికి పొవ్వాకు చేతికిచ్చి 'యింక దమ్మిడికి ఏమీమంటావురా?' అనడిగేది మాయత్త.

'ఒక అప్పచ్చి ఈయత్తా!'' అంటా తీసుకునేటోణ్ణి. ఆ మిందట-

''అత్తాత్తా! మా అయ్య నాలుగు తమలపాకులు తెమ్మన్నాడు. మల్లా తోటకాడికి పొయ్‌నపుడు కోసి పంపిస్తాడంట!'' అంటే-

మా మేనత్తేగదా? మారు మాట్లాడకుండా యిచ్చేసేది. నేను నిక్కతా నీలగతా అప్పచ్చి తినుకుంటా వచ్చి మా అయ్య చేతికి ఆకులు వక్కలు పొవ్వాకుయిస్తే.

''ఒరే దళారి నా కొడకా!'' అంటా నవ్వకునేటోడు.

ఒకప్పుడు దళారోడంటే అంత హీనంగా చూస్తా ఉండ్రి.

ఇప్పుడా? వాడు లేకుండాపోతే ఒక్క పనీ అయ్యేటట్టుగాలే. పెండ్లి చెయ్యించాలన్నా వాడే. పిట్లమింద పెండ్లి ఎగర గొట్టాలన్నా వాడే. సరుకు రేటు పెంచాలన్నా వాడే. దించాలన్నా వాడే. కొనాలన్నా వాడే. అమ్మాలన్నా వాడే. బోడెద్దుల బేరానికైనా బోఫోర్స్ తుపాకులకైనా- ఆడిదాకా ఎందుకు? హిటాసికైనా బ్రోకరోడు ఉండాల్సిందే!

దళారోడు అని చెప్పుకుండే దానికి ఒకప్పుడు దడస్తా ఉండ్రి. అటుమంటిది యిప్పుడు దయిర్నెంగా దర్జాగా ఆపీసులే పెటేసినారు. యా ఊళ్లో లారీ బ్రోకర్ ఆపీసులేంది? మల్లా వాళ్లకొకసంగం. ఆ సంగానికొక ప్రెసిడెంట్. ఒక సెకరట్రీ. ఓయబ్బా! వాళ్లదెంత బెట్టు? వాళ్లకెంత కట్టు? ఆపీసు మాటగాదని లారీ అడుగు ముందుకు కదల్దే!

ఇంక ఈ ప్రెబుత్వంలో మనకేదైనా ఒక అర్జంటు పనిపడిందనుకో. అయిద్రాబాద్‌కు పో. ఆడగాకుంటే ఆడనుంచి అట్నే డిల్లీగ్గూడా పో. ఆడ నీ మొకం చూసే నీ కొడుకు ఎవుడుండాడు? కాలికి బలపం కట్టుకోని తిరుగు. కండ్ల నిండుకు నీళ్లు పెట్టుకోని అడుగు. బొదులు పలికే యదవ ఎవుడుంటాడు? అదే జమ్మని ఒక ష్టారు హోటల్లో కూసో. ఒక బ్రోకరోణ్ణి పిలిపించు. మాటా మాటా కలపతా అంత తాగిపించు. నీకు కావాల్సిన పని చెప్తా బాగా తినిపించు. ఆ మిందట వాడికి చేరాల్సింది చేతిలో పెట్టేయ్. ఆ ష్టారు హోటల్లో నీ ష్టార్ తిరగక పోతే చక్కా వచ్చి నన్నడుగు. అయిన కర్సు కావాలంటే నేను కట్టిస్తా!

''నోకం తెలిస్తే ఈ లోకంలో వొంటికి సెగట్టా తగలకుండా ఎంత నిమ్మతిగా బతికి పోవచ్చు!'' అని ఆలోచించుకుంటా ఆ నాలుగ్గాళ్ల మండపం కాడ పోతావుంటే వెంకటరెడ్డి ఎదురుపడె.

''ఏమిరా అబ్బారే?'' అంటే–

''ఏం చెయ్యమంటావన్నా? చినుకు నేలరాలి నాలుగేండ్ల యిందా! గొడ్డూ గోదకు కసువులే. మణిసికి తిండిలే. వొట్టి గాట్లో వాటి గోష్ట చూళ్లేకుండా వొగిటికి సగంగా అమ్మేస్తిమా? ఆ దుడ్లు తినేస్తిమి. ఇప్పుడు మల్లా నాలుగు చినుకులు రాల్నాయా? గొడ్లు కావాల్సి పడె.''

''పలమనేరు పర్సకో పుంగనూరు పర్సకో పోకుండా యిట్టెందుకు వొచ్చినావురా?''

''పర్సకు పోవాలంటే పర్సుకావద్దా?''

నాకు గబీమనె!

''నువ్వెందు కట్టా ఉలిక్కి పడ్తావే? మన దేముడి సత్తిం మనకు తెలవకుండా ఊలోళ్లకా తెలిస్తింది. నీ కోసరం గాదు. వాడుండ్లా మార్కెట్లో మాబూ సాయిబూ. వాడి కోసరం వస్తి. ఆ యదవ ఏడ్సే బిడ్డకు ఎలక్కాయ చూపించినట్టు 'తెల్లార్తో పోతే మద్దేణం... మద్దేణం కాడ బోతే మావిటేళ!' అంటా తిప్పించి తిప్పించి చంపతా ఉండాడు.''

''వాటి పాపం గూల! దుడ్లురా అవ్వి. పాణం లోపాణం అనుకుణ్ణె మణిసే అనుకో. ఆడికి వొచ్చేకుందికి అసలు రంగు బైట పడిపోతింది. అటుమంటప్పుడు ఆడెవుడో సాయిబూ సతాయిస్తా ఉండాడని యాష్ట పోతే ఎట్రా?''

''అదేందన్నా అట్టంటావే? ఏడేండ్ల కిందట వాడెంత? వాడి అనే బారమెంత? ఆ మార్కెట్టు ముందర పాత గోనె పట్టమింద కూరగాయిలు కుప్పలు బెట్టి అమ్ముకుంటా ఉండె. మార్కెట్టు లోపలికి పోతావుంటే ఒక సారి బయటి కొస్తావుంటే మల్లా వొకసారి పైకి లేచి 'సలాం సలాం రెడ్డయ్యా!' అంటా వుంటే 'పోనీలే పాపం!' అనుకోని ఊర్నంతా వాడి కాడికి మల్లిస్తి. ఊళ్లో పండిందంతా వాడి చేతల మిందనే అమ్మిస్తి. ఈ పొద్దు వాడొక మత్తేబు! ఆ పొద్దు నేను అనుకోకుండా ఉంటే? –''

''ఓరబ్బారే! ఎక్కే దాకనేరా నిచ్చిన కావాల్సింది. ఎక్కేసినాక్కూడా దాన్నెత్తి నెత్తిన

పెట్టుకుండే దానికి ఎవుడికైనా పిచ్చా? ఎర్రా? నువ్వు దోవ చూపించినావు. ఆదోవ పట్టుకోని వాడు ఎగబడిపాయ. ఎగ బడ్తోస్తే 'అది చేస్తా! యిది చేస్తా!' అని వాడేమన్నా మాట కరార్ చేసుకున్నాడా? పోనీ రాత కోత లేమన్నా రాసుకున్నారా?''

''నువ్వు చెప్పేది యింకా బాగుండాదే? ఆ యదవ దగ్గిర 'దేహీ!' అని నేనేమన్నా బిచ్చానికి పాయ్‌నానా? చేబొదులిస్తే చెనిక్కాయిలు తొవ్వి నాకనో చెరుగ్గానిగ ఆడినాకనో యిచ్చేద్దామను కుంటి. అదట్టా పోనీ యిస్తే యిచ్చినాడు. ఈకుండా పోతే చచ్చినాడు. నాలికి సుద్దంగా పెట్టుకుంటే వాడెటుమంటోడికైనా నలుగురు ఉండనే వుంటారు. అది గాదే నాబాద. ఆ పొద్దుట్నుంచీ మేమంతా వాడికి కూరా నారా యాస్తానే ఉండామా? ఏసే వాళ్లం యాడుండావే గొంగిడీ! అంటే ఏసిన చోట్నే! అన్నెట్టుగా ఉంటే సాయిబూ సర సర సరా ఎగబడి వచ్చే సెగదన్నా!

'' అదేరా తమాస నా తండ్రీ! చెమటోడ్సి పండించి నోడు కాదు. కొనుక్కోని తినేవాడు కాదు. యిక్కడ బాగు పడ్తా ఉండేది. మాబూసాయిబూ మాదిర మద్దెనుండే వాళ్లే!''

మేము యిట్టా మాట్లాడుకుంటా ఉండంగానే ఆడికొక కారొచ్చి నిలబడె. కారు ఆడికొస్తానే కూలోళ్లు ఆ కారును కాకులు చుట్టుకున్నెట్టు చుట్టుకుండ్రి. నేనొస్తానంటే నేనొస్తానంటా ఒకరి మిందొకరు ఎగబడ్తా ఉండారు. వాడు ఆ కార్లో కాలిమింద కాలేసి కూసోని బాగా జానడు పొడుగుండే సిగరెట్టు వొగిటెలిగించి చుక్కలు చూస్తా ఉండాడు.

రెప్పార్ప కుండా నేను వాడికల్లానే చూస్తావుండా. అంతలోకే బుజం మింద చెయ్యి పడె. తిరిగ చూస్తే ముత్తారెడ్డన్న!

''ఒరే అబ్బోడా! పదేండ్లప్పుడు వాడూ యీళ్లల్లో ఒకడు. వాడికి నోట్లో నాలికుండె. వాడు చెప్పిన దానికంతా యీళ్లు తలాడించిరి. అది పెట్టుబడిగా చేసుకుండె. సైకిలెక్కె. స్కూటర్ ఎక్కె. ఇప్పుడు కార్లో వచ్చె. ఈళ్లంతా యిట్నే వున్నెంత కాలం వాళ్లకేం ఢోకాలే. వాళ్లు ఎగబడి పోతానే ఉంటారు. అదెట్టంటావా? కొండ మింద దేముడుండాడు గదా? మీరంతా ఆ దేముణ్ణి మొక్కతానే ఉండారు. ఆయన మొక్కించు కుంటానే వుండాడు. ఆయన అట్నే ఉండాడు. మొక్కినోళ్లు యిట్నే ఉండారు. నడిమద్దెన ఉండే వాళ్లకే గదరా పొట్టలు బెట్టిపోతా ఉండేది?'' అనె.

పెట్టుబళ్లేని యాపారం గదా? వాళ్లా మొనగోళ్లంటే! అనుకుంటి.●